క్లుప్తంగా

81 మందికి వైద్య పరీక్షలు

జరుగుమల్లి: మండలంలోని పైడిపాడు గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. కామేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రేష్మి 81 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, సుగర్ బాధితులకు ఆరోగ్య జాగ్రత్తలు తెలియజేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. సీహెచ్ఓ శిరీష, ఏఎన్ఎం రమాదేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన దిగుబడులు సాధించాలి

కందుకూరు: పొగాకు సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటిస్తూ నాణ్యమైన దిగుబడులు సాధించాలని వేలం నిర్వహణాధికారి కె.రాజగోపాల్‌రెడ్డి అన్నారు. లింగసముద్రం మండలంలోని వీఆర్‌కోట గ్రామంలో గురువారం పొగాకు సాగులో యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకులో పురుగుమందుల అవశేషాలు, అన్యపదార్థాలు లేకుండా చూసుకోవాలన్నారు. నాణ్యమైన నారును తగిన సమయంలో పొలంలో నాటాలని, సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. విచ్చలవిడిగా పురుగు మందుల వాడడం వల్ల అనేక అనర్థాలు వస్తాయని, విదేశీ ఎగుమతులు తగ్గుతాయని చెప్పారు. బోర్డు సూచించిన పురుగు మందులనే వాడాలని సూచించారు. ఐటీసీ మేనేజర్ గోలి వెంకటేష్ మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, ప్రధానంగా జీవామృత ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ఉపేంద్ర, జీపీఐ మేనేజర్ రవి, పొగాకు రైతులు పాల్గొన్నారు.

18న మండల సమావేశం

ఉలవపాడు: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 18 న జరుగుతుందని ఎంపీడీఓ చెంచమ్మ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 18న మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. మండల పరిధిలోని అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

దత్త క్షేత్రాల యాత్రలకు ఆర్టీసీ బస్సులు

కందుకూరు: పవిత్ర మార్గశిర మాసంలో పలు దత్తక్షేత్రాల దర్శనానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు కందుకూరు డిపో మేనేజర్ పెద్దన్నశెట్టి గురువారం తెలిపారు. దీనిలో భాగంగా జనవరి 5వ తేదీ రాత్రి 8 గంటలకు కందుకూరు, సింగరాయకొండ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయని చెప్పారు. యాత్రలో ప్రధానంగా కురువాపురంలోని శ్రీపాద వల్లభ దత్తాత్రేయస్వామి, బీదర్ మాణిక్య ప్రభు, తుల్జాపూర్ భవానీ మాత, అక్కలకోట మహారాజు, పండరీపురం పాండురంగనాథుడు, కొల్హాపూర్ మహాలక్ష్మీ శక్తిపీఠం, నరసింమబాడ సరస్వతి నరసింహస్వామి, గానగాపూర్ సరస్వతి నరసింహ దత్తాత్రేయస్వామి, మంత్రాలయం రాఘవేంద్రస్వామి పుణ్యక్షేత్రాలను దర్శించుకోవచ్చునని తెలిపారు. యాత్రలో పాల్గొనే నాలుగు రోజుకు ఒక్కొక్కరికి టికెట్ కింద రూ.6000 చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. పూర్తి వివరాలకు 7382889870 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు: పట్టణంలోని కోటేశ్వర థియేటర్ ప్రాంతంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, లైన్ లాగుట పనులు ఉన్నందున శుక్రవారం ఉదయం 10.30గంటల నుంచి 12.00గంటల వరకు 11కేవీ ఎస్‌బీఐ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ టీవీ నరసింహం తెలిపారు. అలాగే పామూరురోడ్డు జంక్షన్‌లో స్తంభం మారుస్తున్నందున 11కేవీ పామూరురోడ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు గమనించాలని కోరారు.

పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే చర్యలు

కనిగిరి రూరల్: పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే ప్రభుత్వ పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణ ప్రజల ఫిర్యాదు మేరకు గురువారం 8వ వార్డులో మున్సిపల్ చైర్మన్ గఫార్ క్షేత్రస్థాయిలో పర్యటించి వార్డు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మురికినీరు నిల్వ ఉందని, చెత్త చెదారంతో దుర్గంధం వెదజల్లుతోందని ఆయన దృష్టికి తేగా శానిటేషన్ సిబ్బందిని పిలిపించి శుభ్రం చేయించారు. కౌన్సిలర్ జాస్మిన్ ఆజాద్, సచివాలయ శానిటరీ సెక్రటరీ లోకేష్, మున్సిపల్, వార్డు సభ్యులు, ప్రజలు ఉన్నారు.

16 మంది జూదరుల అరెస్టు

కనిగిరి రూరల్: మండలంలోని రెండు ప్రాంతాల్లో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి 16 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.14,210 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.మాధవరావు తెలిపారు. నందనమారెళ్ల గ్రామ సమీపంలోని పొలాల్లో దాడులు నిర్వహించి 10 మందిని అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి రూ.10,240 నగదు, చల్లగిరిగిల గ్రామ సమీప పొలాల్లో దాడిచేసి 6 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.3,970 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు

● ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్



రామలింగాపురంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బుర్రా

వెలిగండ్ల: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గడప గడపకు సంక్షేమ ఫలాలు అందాయని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. మండలంలోని రామగోపాలపరం సచివాలయంలో గురువారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలుచేశారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలన్నీ లబ్ధిదారుని ఇంటికే వచ్చి చేరుతున్నాయని తెలిపారు. గత ప్రభుత్వ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల సిఫార్సులకే పెద్ద పీట వేసి అర్హులకు అన్యాయం చేశారన్నారు. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా రూ.లక్షల కోట్ల రూపాయలు లబ్ధిదారుల ఖాతాల్లోకి వచ్చి చేరుతున్నాయని తెలిపారు. ధనిక, పేద తారతమ్యాలు లేకుండా ఉచితంగా ఉన్నత విద్య చదువుకునేందుకు అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీవిద్య పథకాలు ఎంతో ఉపకరిస్తాయని, బడ్జెట్‌లో 10 శాతానికి పైగా నిధులు కేటాయించి విద్యారంగాభివృద్ధికి ముఖ్యమంత్రి అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు.

అలసత్వం లేకుండా చూడాలి

సచివాలయ పరిధిలోని గ్రామాల్లో సమస్యల పరిష్కారంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అలసత్వం లేకుండా అంకితభావంతో పనిచేసి పరిష్కరించాలని ఎమ్మెల్యే సచివాలయ సిబ్బందికి సూచించారు. సచివాలయ, వలంటరీ వ్యవస్థలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రెండు కళ్లుగా భావిస్తున్నారని, అందుకు తగ్గట్టుగా సచివాయ సిబ్బంది పని చేసి ప్రభుత్వానికి పేరుప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. ఎంపీడీఓ తాతపూడి సుకుమార్, పార్టీ మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, సర్పంచ్ గజ్జల నాగేశ్వరరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ కాకర్ల వెంకటేశ్వర్లు, వైద్యవిభాగం రాష్ట్రనాయకులు డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, ముదిరాజ్ రాష్ట్ర కార్యదర్శి కె.పద్మావతి, వైఎస్సార్ సీపీ నాయకులు వై.నాగూర్‌యాదవ్, టి.దేవసహాయం, టి.నాని, గోన జేమ్స్, గంజి రవీంద్ర, గజ్జల నాగేశ్వరరావు, మేడం ఆదిరెడ్డి, ఎలికే నారాయణ, వెంకట్రామయ్య, బొబ్బ వెంకటరెడ్డి, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా రిజిస్ట్రేషన్లు 17 వరకు పొడిగింపు



జరుగుమల్లిలో పాఠశాల గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ

లింగసముద్రం: ఆడుదాం ఆంధ్రా రిజిస్ట్రేషన్లు ఈ నెల 17 వరకు పొడిగించినట్లు ఎంపీడీఓ శేషుబాబు మంగళవారం చెప్పారు. 13 వరకు ఉన్న రిజిస్ట్రేషన్లు 17 వరకు పొడిగించగా, 15 నుంచి జరగనున్న ఆటల పోటీలను 26 వరకు పొడిగించినట్లు చెప్పారు. గ్రామస్థాయి నుంచి ఆటల్లో ప్రావీణ్యం ఉండే వారిని వెలికితీసే కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కబడ్డీ, క్రికెట్, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ ఆటలు నిర్వహిస్తామన్నారు. ఆటల్లో పాల్గొనే వారు సమీప సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలన్నారు.

ఆట స్థలాలు సిద్ధం చేయండి

జరుగుమల్లి: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంఈఓ నాగేంద్ర వదన్ సూచించారు. జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆట స్థలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. బ్యాడ్మింటన్, క్రికెట్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలకు గ్రౌండ్ సిద్ధం చేయాలని వ్యాయాయ ఉపాధ్యాయుడు ఎన్‌టీ ప్రసాద్‌కు చెప్పారు. ఈ నెల 26 నుంచి పోటీలు ప్రారంభమవుతాయని, ఆసక్తి ఉన్న వారు 17వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ కె.జలజాక్షి తెలిపారు.

టీటీడీ కళ్యాణ మండపం నిర్మించండి

● టీడీడీ చైర్మన్ భూమనకు డాక్టర్ బత్తుల వినతి



టీడీపీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డితో డాక్టర్ బత్తుల

సింగరాయకొండ(మర్రిపూడి): దక్షిణ సింహాచలంగా పేరుగాంచిన పాతసింగరాయకొండ శ్రీ వరహా లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పర్యవేక్షణలో టీటీడీ కళ్యాణ మండపం నిర్మాణానికి చర్యలు చేపట్టాలని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, దేవస్థాన చైర్మన్ పామర్తి మాధవరావు విజ్ఞప్తి చేశారు. కళ్యాణ మండపానికి సంబంధించి దాతల సహకారంతో నిధులు, స్థలం సమకూర్చామని, టీటీడీ అధికారులకు స్థలాన్ని స్వాధీనం చేశామని వివరించారు. కళ్యాణ మండపం పనులు ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని కోరారు. మూలగుంటపాడు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మల్లికార్జునస్వామి ఆలయానికి కూడా నిధులు సమకూర్చాలని కోరారు. చుక్కా కిరణ్‌కుమార్, చొప్పర వెంకన్న, జె.చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

సంక్షేమ పథకాలతో విప్లవాత్మక మార్పులు



కందుకూరు సచివాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

కందుకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో సమాజంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని జేసీఎస్ కో ఆర్డినేటర్ ముప్పవరపు కిశోర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం గురువారం పట్టణంలోని సుల్తాన్ మొహిద్దీన్ నగర్ సచివాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించడంతో పాటు, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా పరిపాలనపై గ్రామాల్లో, పట్టణాల్లో విప్లవాత్మక మార్పులు కనిపిస్తున్నాయన్నారు. సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, నాడు–నేడు కార్యక్రమం ద్వారా విద్యాలయాలు, వైద్యాలయాలు అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ మాట్లాడుతూ పేదరికం నుంచి ప్రజలంతా బాగుపడాలనే లక్ష్యంతో సంక్షేమాన్ని అందిస్తున్నారని చెప్పారు. పట్టణంలోని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి వల్ల అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, అభివృద్ధి ప్రధాత మహీధర్ రెడ్డిని మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు జాజుల కోటేశ్వరరావు, వక్ఫ్‌బోర్డు మెంబర్ సంధాని, జనార్దన స్వామి దేవస్థానం చైర్మన్ రావులకొల్లు బ్రహ్మానందం, నాయకులు గణేశం గంగిరెడ్డి, సచివాలయ కన్వీనర్లు అల్లాభక్షు, కరేటి సుబ్బారావు, తల్లపనేని వరమ్మ, పాశం కొండయ్య, తాటికొండ హరిబాబు, షేక్ హమీద్, కూరపాటి వెంకట్రామిరెడ్డి, గొర్రెపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓలు

హనుమంతునిపాడు: స్థానిక భవిత కేంద్రంలో గురువారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల విద్యార్థులకు ఆటల పోటీలు, డిబేట్, క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం ఎంఈఓ జి.పెద్దిరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వెలిగండ్ల ఎంఈఓ దేవిరెడ్డి రామిరెడ్డి, ఎస్ రమణయ్య మాట్లాడుతూ దివాంగుల విద్యార్థులు తమ పేర్లను భవిత సెంటర్లలో నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం దివ్యాంగులకు అన్ని మౌలిక సదుపాయలు కల్పించి ఉన్నత విద్యాభ్యాసం అందిస్తుందన్నారు. భవిత సెంటర్లలో దివాంగులకు ఫిజియోథెరపి వైద్య సేవలు అందిస్తుందన్నారు. దివాంగుల పట్ల తల్లిదండ్రులు చిన్నచూపు చూడవద్దన్నారు. ఫిజియోథెరపీ వైద్యులు పుల్లయ్య, భవిత సెంటర్ రిసోర్స్‌పర్సన్ కొత్తపల్లి శ్రీనివాసులు, ఎంఆర్పీలు కొటికల చిన్నబాదుర్ల, జి.పవిత్ర కుమారి పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలిపై చర్యలకు సిఫార్సు

సీఎస్‌పురం(పామూరు): పాఠశాలకు గైర్హాజరైన ఉపాధ్యాయురాలిపై చర్యలకు డీఈఓకు సిఫార్సు చేసినట్లు మండల రెండవ విద్యాశాఖాధికారి రాజాల కొండారెడ్డి తెలిపారు. మండలంలోని బోయమడుగుల, పిల్లిపల్లి, వెంకటాయచెరువు, చిన కొటాలుపల్లి పాఠశాలలను ఎంఈఓ గురువారం తనిఖీచేశారు. ఈసందర్భంగా చినకొటాలుపల్లె పాఠశాలకు వెంకటాయచెరువు పాఠశాల నుంచి డిప్యూటేషన్‌పై నియమించిన ఉపాధ్యాయురాలు అనంతలక్ష్మి ముందస్తు సెలకు మంజూరు లేకుండా గైర్హాజరవడాన్ని గుర్తించినట్లు తెలిపారు. పాఠశాలకు కేవలం 5 మంది విద్యార్థులు మాత్రమే హాజరవుతున్నారని ఉపాధ్యాయురాలు సోమవారం నుంచి పాఠశాల విధులకు గైర్హాజరయ్యారని డి.జి.పేట సీఆర్పీ, వంట ఏజెన్సీవారు ఎంఈఓ దృష్టికితీసుకురాగా ఉపాధ్యాయురాలిపై చర్యల నిమిత్తం డీఈఓకు నివేదిక పంపుతున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో ఎక్కడైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. శానిటరీ వర్కర్లను వినియోగించుకుని పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా తగు జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో రికార్డులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి, మధ్యాహ్న భోజన నిర్వహణపై అడిగి మెనూ విధిగా అమలుచేయాలని ఆదేశించారు.

ముగ్గురిపై కేసు నమోదు

కనిగిరి రూరల్: కనిగిరి మండలం శంఖవరం రెవెన్యూలో సర్వేనంబర్ 285లో ఉన్న తన భూమిని శివరామిరెడ్డి మరో ఇద్దరు ఆక్రమించుకోబోగా అడ్డుకున్న తనను వారు గాయపరిచారని మడతల రమణమ్మ గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రమణమ్మ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై మాధవరావు పేర్కొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



లక్ష్మీనరసాపురంలో పథకాల లబ్ధి ప్రదర్శన బోర్డును ఆవిష్కరిస్తున్న అధికారులు, నేతలు

పామూరు: పార్టీ, కుల, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా గడప గడపకూ సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందని ఈఓపీఆర్‌డీ కేఎల్.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి అన్నారు. మండలంలోని లక్ష్మీనరసాపురం సచివాలయ పరిధిలో గురువారం సర్పంచ్ మన్నేపల్లి విజయ్‌శేఖర్ అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్‌డీ, మండల పార్టీ అధ్యక్షుడు సంక్షేమ పథకాల లబ్ధి ప్రదర్శన బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వలంటీర్లకు సర్వే కిట్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోఆప్షన్ నాయబ్‌రసూల్, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, జొన్నలగడ్డ గోవిందయ్య, వేముల రాంబాబు, శ్రీరాం శ్రీను, ఇల్లూరి కొండమ్మ, జక్కు సుబ్బారెడ్డి, మూల కోటిరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల లబ్ధి ప్రదర్శన బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

ఆర్థిక చేయూతకే సంక్షేమ పథకాలు

కనిగిరి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఆర్థిక చేయూతనిచ్చేందుకే అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తోందని ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీ, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు మడతల కస్తూరిరెడ్డి అన్నారు. మండలంలోని తాళ్లూరు సచివాలయం పరిధిలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల లబ్ధి వివరాల ప్రదర్శన బోర్డును ఆవిష్కరించారు. రహిమాన్, మూలె మాలకొండారెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీ, వలంటీర్లు, పీఎస్‌లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

సుజాతను సన్మానించిన ఎమ్మెల్యే బుర్రా



సుజాతా శ్రీరామ్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే బుర్రా, నాయకులు

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా కనిగిరి నియోజకవర్గ పార్టీ మహిళా అధ్యక్షురాలు, స్థానిక 7వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ తమ్మినేని సుజాత శ్రీరామ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈసందర్భంగా గురువారం స్థానిక వైఎస్సార్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సుజాతను ఎమ్మెల్యే, ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సుజాతను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలోపేతానికి ఆమె చేసిన సేవలకు ప్రతిఫలంగానే సుజాతకు పదవి వరించిందన్నారు. పార్టీకోసం పని చేసేవారికి ఎప్పుడూ అధిక ప్రాధాన్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వాసవీసత్ర సముదాయాల జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, వైద్యవిభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, శ్రీరామ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



పామూరులో అంగన్‌వాడీ కేంద్ర తలుపు తీస్తున్న సచివాలయ సిబ్బంది



మాట్లాడుతున్న ఆర్డీఓ జాన్ ఇర్విన్

సీఎస్‌పురం(పామూరు): అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెకు దిగి కేంద్రాలు మూసివేసిన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం అంగన్‌వాడీ కేంద్రాలను తహసీల్దార్ షేక్.నాగూర్‌మీరా, ఎంపీడీఓ సీహెచ్.రామచంద్రరావు, మహిళాపోలీస్, సచివాలయ సిబ్బందిల ఆధ్వర్యంలో తాళాలు పగులగొట్టారు. ఈ సందర్భంగా కేంద్రాల్లోని సరుకులు, రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకలాపాలు, పౌష్టికాహార పంపిణీ ఎప్పటిలాగే జరిగేలా చూసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సుందరరామయ్య, పీఎస్ రాంప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.దేవకృపావరం పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు తెరవండి

హనుమంతునిపాడు: అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెలో పాల్గొన్న నేపథ్యంలో సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు కేంద్రాలను తెరవాలని ఆర్డీఓ జాన్ ఇర్విన్ అన్నారు. గురువారం ఆయన కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తలు తాళాలు ఇవ్వని పక్షంలో పగులకొట్టి కేంద్రాలను ప్రారంభించాలన్నారు. చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని వెంటనే అందించాలన్నారు. తహసీల్దార్ పుల్లారావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ కేవీ క్రిష్టారావు, ఈఓఆర్డీ, షేక్ షరీఫ్, కార్యదర్శి శ్రావణ సంధ్యా, ఇంజినీర్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పామూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెకుదిగి కేంద్రాలు మూసివేసిన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను సచివాలయ సిబ్బంది పగులగొట్టి తెరిచారు. ఈసందర్భంగా కేంద్రాల్లోని స్టాక్‌ను పరిశీలించారు. కేంద్రాలకు వచ్చే పిల్లలకు, తల్లులు, గర్భిణులకు బాలింతలకు పౌష్టికాహారం పంపిణీకి చర్యలు చేపడుతున్నట్లు సచివాలయ సిబ్బంది తెలిపారు.

అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణపై శ్రద్ధ వహించాలి

● కనిగిరి ఆర్డీవో జాన్ ఇర్విన్



సిబ్బందితో మాట్లాడుతున్న కనిగిరి ఆర్డీఓ జాన్ ఇర్విన్

మర్రిపూడి: రాష్ట్రంలో పేదలకు పంపిణీ చేసిన అసైన్‌మెంట్ వ్యవసాయ భూములను రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులరైజేషన్ చేయాలని నిర్ణయించినందున అధికారులు ఆ దిశగా కృషి చేయాలని కనిగిరి ఆర్డీవో జాన్‌ఇర్విన్ సూచించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సిబ్బందికి అసైన్‌మెంట్ రెగ్యులరైజేషన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. 20 ఏళ్ల క్రితం ప్రభుత్వం నుంచి అసైన్‌మెంట్ పట్టాలు పొందిన లబ్ధిదారులందరూ రెగ్యులరైజేషన్‌కు అర్హులని స్పష్టం చేశారు. అధికారులు క్షేత్ర స్థాయిలో రైతులను కలిసి వివరాలు సేకరించాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ ఎం.హరిబాబు, డిప్యూటీ తహసీల్దార్ భూపతి, ఆర్ఐ రమణ, వీఆర్‌ఓలు, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకాశం క్రికెట్ లీగ్ విజేత కొండపి వారియర్స్



కొండపి వారియర్స్ జట్టుకు కప్ అందజేస్తున్న సీఐ రంగనాథ్

సింగరాయకొండ(మర్రిపూడి): క్రీడలతో యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, శారీరక దృఢత్వంతోపాటు ఆరోగ్యంగా ఉంటారని సీఐ దాచేపల్లి రంగనాథ్ పేర్కొన్నారు. సింగరాయకొండ మండల కేంద్రంలో ఏఆర్‌పీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గురువారం ప్రకాశం క్రికెట్ లీగ్ ముగింపు కార్యక్రమంలో సీఐ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గత 10 రోజులుగా నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో మొత్తం 32 జట్లు పాల్గొన్నాయి. విజేతగా నిలిచిన కొండపి వారియర్స్ జట్టు రూ.50 వేల నగదు బహుమతితోపాటు షీల్డ్ అందుకుంది. ద్వితీయ స్థానంలో నిలిచిన మూలగుంటపాడు వారియర్స్‌కు రూ.30 వేల నగదు బహుమతి అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, బెస్ట్ బౌలర్, బెస్ట్ ఫీల్డర్, బెస్ట్ బ్యాట్స్‌మన్‌కు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేసినట్లు ఎంపీ మాగుంట బంధువు సాగర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జరుగుమల్లి మాజీ ఎంపీపీ బెల్లం సత్యన్నారాయణ, శ్రీశైలం దేవస్థాన బోర్డు మెంబర్ తన్నీరు ధర్మరాజు, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, షేక్ సలీమ్ బాషా, షేక్ పటేల్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



మహిళలకు గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్న ఈఓఆర్డీ



పోట్లూరులో కేంద్ర ప్రభుత్వ పథకాలపై మాట్లాడుతున్న అధికారులు

గుడ్లూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకులు, పోస్టాఫీసులు ద్వారా అమలు చేస్తున్న బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సూర్యనారాయణ సింగ్ అన్నారు. మండలంలోని పోట్లూరు, పాజర్ల గ్రామాల్లో గురువారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పీఎం జేజేబీవై, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకాల్లో చేరడం వల్ల భవిష్యత్‌లో చేరిన వారి కుటుంబాలకు పలు ప్రయోజనాలు కలుగుతాయన్నారు. అలాగే పీఎం కిసాన్, జల జీవన్‌మిషన్, స్వచ్ఛభారత్, ప్రధానమంత్రి ఆవాజ్‌యోజన, పీఎం పోషన్ అభియాన్ తదితర పథకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. సర్పంచ్ పాటి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ జనిగర్ల రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ రాజశేఖరరావు, ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు, వ్యవసాయాధికారి రవికుమార్, వైద్యాధికారి సుబీహా సుల్తానా, ఏపీఎం అశోక్, గృహనిర్మాణ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

టంగుటూరు: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈఓఆర్డీ నర్రా జగదీష్‌బాబు సూచించారు. గురువారం టంగుటూరు 3వ సచివాలయంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. ఉజ్వల యోజన కింద 28 మంది మహిళలకు నిర్మల ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సిలిండర్లు, స్టవ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు బాలాజీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.